# ప్రియంవద -సూరేపల్లి విజయ

అందం, ఐశ్వర్యం, అహంభావం - అన్నీ కలబోసిన ఆమె ప్రియంవద.

నీలం రంగు పట్టుచీరలో ఆమె చీరకే అందం తెస్తోంది. లోనెక్‌బ్లౌజ్‌లో నుండి పాలపొంగులా అందాలు తొంగి చూస్తోంటే, ధగ ధగ మెరిసే వ్యానిటీ బ్యాగ్ నూపుతూ, మెరుపు తీగలా మెట్లుదిగివస్తోంది.

అప్పుడే లోనికి ప్రవేశించిన శ్రీకాంత్, తన భార్య అందానికి ముగ్ధుడయ్యాడు. రోజూ చూస్తోన్నా తనివి తీరని అందం, తరగని ఆకర్షణ ఆమెది.

"ప్రియా! స్వీటీ స్కూలు నుండొచ్చిందా?" సౌమ్యంగా అడిగాడు.

"వచ్చింది" పొడిగా సమాధానం చెప్పి కారెక్కింది.

కారు రివ్వుమని దూసుకుంటూ గేటుదాటి వెళ్ళి పోయింది. అలాగే చూస్తూ నిలబడిపోయాడు శ్రీకాంత్. పైకివెళ్ళి, స్నానం చేసి, స్వీటీని కాసేపు ఆడించి, హోమ్ వర్క్ చేయించాడు. ఆయాచే అన్నం తినిపించి పడుకోబెట్టాడు.

రాత్రి తొమ్మిదవుతోంది. ప్రియా ఇంకా రాలేదు. తను అలాగే బాల్కనీలో కుర్చీలో కూర్చొని సిగరెట్ తాగుతూ, ఆమెకోసం ఎదురుచూస్తూ గతంలోకి జారుకున్నాడు.

★ ★ ★

తల్లిలేని ప్రియంవదను మేనమామ చాలా గారాబంగా పెంచాడు. స్నేహితులతో షికార్లూ, పిక్నిక్‌లూ, టూర్లూ, ఎక్కడికి వెళ్తానన్నా కాదనేవాడు కాదు.

ఒకవేళ కాదంటే మొండికేసేది. తన పంతం నెగ్గించుకునేది. అందుకేనేమో బాధ్యత తెలీకుండా తయారయ్యింది.

చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్న తనను మామయ్య చేరదీసి, ప్రయోజకుడిని చేశాడు. తన తెలివి తేటలమీద, శక్తి సామర్థ్యాలమీద అతన్నెంతో గురి. అన్నింటికంటే తన సహనగుణం అతనికెంతో ఆకట్టుకుంది.

అందుకేనేమో ప్రియతో తన వివాహం జరిపించాలనుకున్నాడు. తనకు ప్రియ అంటే ఇష్టమే. ఆమె అందం తననంతగా ఆకట్టుకుంది.కాని ప్రియ ఒప్పుకుంటుందా? ఒకవేళ ఒప్పుకుంటే ఆమె ప్రవర్తన మార్చగలడా తను? పోనీ మార్చలేకపోతే... కనీసం సర్దుకోగలడా?... సర్దుకు పోగలననే మామయ్య నమ్మకం!

ప్రియ తనతో పెళ్ళికి ఒప్పుకోవటం తన్నెంతగానో ఆశ్చర్యపరిచింది. తనుసోషల్ యానిమల్ కాదని, కంట్రీ బ్రూట్‌నని ఆమె ఉద్దేశ్యం. అయితే మరి ఎందుకు ఒప్పుకున్నట్లు?! బహుశా తను ఆమె చెప్పినట్లువిని పడుంటాననేమో!!

★ ★ ★

కారు ఆగిన శబ్దం విని ఈ లోకంలోకి వచ్చాడు. ప్రియ స్నానంచేసి, నైటీ వేసుకొని, డైనింగ్ హాల్‌కి వచ్చింది.



"స్వీటీ పడుకుందా? శ్రీకాంత్ భోజనం చేశాడా?" కాజ్యువల్‌గా అడిగింది ఆయాను.

ఆయా వడ్డించబోతోంటే ఆమెను వెళ్ళి పడుకోమని పంపించాడు. రెండు ప్లేట్లలో అన్నం పెడుతున్నాడు.

"నౌకర్లుండగా నువ్వు పెట్టడమెందుకు?"

"ప్రియా! కొన్ని పనులు మనం చేసుకుంటేనే తృప్తిగా ఉంటుంది. అలసిపోయినట్లున్నావు. తినిపించమంటావా?" లాలనగా అడిగాడు.

"అవసరం లేదు. నేను తింటాను." ముక్తసరి సమాధానం.

నిశ్శబ్దం...

అతనికి పెరుగుకు బదులు మజ్జిగ అలవాటు. అన్నం మెత్తగా పిసికి కొద్దిగ పెరుగు వేసుకొని గుజ్జుగా కలిపి తింటున్నాడు. చివరకు ప్లేటు పైకెత్తి తాగేస్తోంటే ఎలర్జీగ అతనివైపు చూస్తోంది.

"ఛీ! టేబుల్ మానర్స్ కూడా తెలియదు నీకు."

"టేబుల్ మానర్స్ తెలీకపోయినా అసలు మానర్స్ తెలుసు."

"అంటే నాకు మానర్స్ తెలీదనా నీఉద్దేశ్యం?"

"ఆ సంగతి నీకే తెలియాలి!"

"శ్రీకాంత్! ఇష్టం వచ్చినట్లు మాట్లాడకు" అంటూ చేయి కడిగేసుకొని పైకెళ్ళిపోయింది.

ఆమెతో పాటే పైకి వెళ్ళి, బాల్కనీలో పచార్లుచేస్తూ సిగరెట్ తాగుతున్నాడు.

వైవాహిక జీవితం గురించి ఎన్నో కలలు కన్నాడు.

ఏమిటో అంతా నిస్సారంగా గడిచి పోతోంది. చిన్నప్పటి నుండీ కలిసి పెరిగిన ప్రియను ఏమీ అనలేక పోతున్నాడు.

నిద్రముంచుకొస్తూంటే బెడ్రూంలోనికి నడిచాడు. డబుల్ కాట్‌బెడ్ మీద ముడుచుకుని పడుకుంది.

రగ్గు తీసి తను కప్పుకొని ఆమెకు కూడా కప్పి దగ్గరకు తీసుకున్నాడు.

అప్రయత్నంగా ఆమె అతనిని అల్లుకు పోయింది. నిద్రకాస్తా ఎగిరిపోయింది.

★ ★ ★

ప్రియకు ప్రొద్దున్నే లేచే అలవాటు లేదు. పేపర్ చదువుతోన్న శ్రీకాంత్, ఆయా తెచ్చిన కాఫీ అందుకుంటూ,

"స్వీటీని లేపు. స్కూలుకు టైమవుతోంది." ఆదేశించాడు.

"అలాగే బాబూ" అంటూ వెళ్ళిపోయింది.

అతనికి ఉదయమే లేచి భార్య ఇచ్చినకాఫీ తాగాలనీ, తనకూ, స్వీటీకి ఆమే స్వయంగా అన్నీ చేయాలని కోరిక. కాని అవన్నీ తీరని కోరికలే.

ప్రియ ఇవన్నీ పట్టించుకోదు. నిజానికి ఆమె వయస్సుకు తగ్గట్టు మనస్సు ఇంకా వికసించలేదు. ముఖ్యంగా పుట్టిల్లు, మెట్టినిల్లు ఒకటే కావడంవల్ల అసలు కష్టసుఖాలే తెలీవు.

స్వీటీని స్కూలు దగ్గర డ్రాప్‌చేసి, అతను ప్రియా ఇండస్ట్రీస్‌కు బయలుదేరాడు.

ప్రియ తీరికగా లేచి ఆయా ఇచ్చిన బెడ్ కాఫీ తాగి పేపర్ తిరగేసి బాత్రూంలోకెళ్ళింది.

'చిక్ బుక్... చిక్ బుక్ రైలే... అదిరెను దీని స్టయిలే' పాటను హమ్ చేస్తూ అలా షవర్ కింద ఎంతసేపుందో ఆమెకే తెలీదు.

టవల్ భుజాలవరకు చుట్టుకొనొచ్చి టేబుల్ దగ్గర నిలబడి 'షవర్ టు షవర్'ను ఒంటినిండా చల్లుకొని వార్డ్‌రోబ్ దగ్గరకు వచ్చింది ఒక్కొక్క చీర తీస్తోంది. పెడ్తోంది. చివరకు లేత ఆకుపచ్చ, రాణికలర్ కాంబినేషన్‌లో ఉన్న టిష్యూజరీ చీర కట్టుకొని ప్రత్యేకంగా తయారై జాస్మిన్‌పెర్ఫ్యూమ్ స్ప్రే చేసుకుంది. క్రిందికి దిగుతూ...

"ఆయా... ఈ రోజు మహిళామండలిలో మీటింగ్ పార్టీ అంది. రావడం ఆలస్యమౌతుంది." అంటూ వెళ్ళిపోయింది.

★ ★ ★

స్కూలు నుండి స్వీటీవచ్చి షూ విప్పకుండానే ఆయా ఒళ్ళో వాలిపోయింది.

ఒళ్ళు కాలిపోతోంటే ఎత్తుకెళ్ళి మంచంమీద పడుకోబెట్టి డాక్టరుకు ఫోన్ చేసింది. డాక్టరువచ్చి మందులిచ్చి తగిన జాగ్రత్తలు చెప్పి వెళ్ళాడు. తరువాత శ్రీకాంత్ వచ్చాడు. స్వీటీని ఆ పరిస్థితుల్లో చూసి చాలా బాధపడ్డాడు.



"నీ కష్టనష్టాల్లో నేనూ పాలుపంచుకొంటాను మోహన్"

"నాకిపుడేం కష్టాలు లేవు కదా డార్లింగ్"

"అదే.. నేను చెప్పేది పెళ్ళయిన తర్వాతేలే!"

వి.చిన్నకుమార్
65-16-12, ద్వారకానగర్
కాకినాడ-3.

అలాగే పాప దగ్గర కూర్చుండిపోయాడు. రాత్రి ఎనిమిది గంటలవుతోంది. అప్పుడే వచ్చిన ప్రియ మామూలుగా మేడమీద గదిలోకి వెళ్తోంది. "ప్రియా" అని అరిచాడు.

అలవాటులేని ఆ పిలుపుకు క్షణకాలం ఆమె నివ్వెరపోయింది. అలాగే వెనుతిరిగి చూసింది.

"ప్రియా! స్వీటీని కన్నందుకైనా దాని మంచిచెడ్డలు పట్టించుకోవా?"

"ఏమైందిప్పుడు?" నూతిలోంచి వస్తోన్నట్లుగా ఉంది ఆమె మాట.

"ఎంత జ్వరంతో బాధపడుతోందో తెలుసా?"

"దానికి అంత కోపమెందుకు? డాక్టర్ని పిలిపించక పోయారా?" అహంభావాన్ని అణుచుకోలేక అంటోన్న మాటలవి.

"ప్రియా! కనీసం మాతృత్వం విలువ కూడా నీకు తెలియడంలేదు. అసలు మనిషివేనా నువు? ఛీ!" అంటూ కోపంతో వెళ్ళిపోయాడు.

నిజానికి ఆ పరిస్థితిలో స్వీటీని వదిలివెళ్ళేవాడే కాదు. ఆమెకు ట్రీట్‌మెంట్ ఇవ్వాలనే అలా చేశాడు.

ప్రియ స్వీటీ ఉన్న గదిలోకి వచ్చింది. ఆయా స్వీటీ ఒళ్ళంతా తడిగుడ్డతో తుడుస్తోంది.

మగతలో 'ఆయా, ఆయా' అని కలవరిస్తోంది. దగ్గరగా వెళ్ళి, నుదుటిమీద చెయ్యివేసి...

"స్వీటీ, నేను వచ్చానమ్మా! ఇటు చూడు" అంటోంది ప్రియ. స్వీటి కళ్ళు తెరిచి ఒకసారి తల్లిని చూసింది. తిరిగి ఆయా చెయ్యి పట్టుకుని...

"ఆయా నా దగ్గరేఉండు. నన్నొదిలిపెట్టి వెళ్ళకు." నీరసంగా అంటోంది.

"నేను ఎక్కడికి వెళ్ళనమ్మా! నీ దగ్గరే ఉంటాను. నా తల్లివి కదూ పడుకో" ఓదారుస్తోంది.

స్వీటీని తను ఎంత దూరం చేసుకుందో అప్పుడుగానీ బోధపడలేదు. మాతృత్వం మేల్కొంది. స్వీటీ తిరిగి కళ్ళు మూసుకోగానే ఆయాను పొమ్మని సైగ చేసింది.

తడిగుడ్డతో ఒళ్ళంతా తుడుస్తూ, గంటకొకసారి జ్వరంచూస్తూ అన్నం తినకుండా అలాగే కూర్చుండి పోయింది.

రాత్రి పన్నెండు గంటల తరువాత బాగా తాగొచ్చిన శ్రీకాంత్‌ను చూసి స్థాణువులా అయిపోయింది. కొంతసేపటికి తేరుకొని తూలుతూ నడుస్తోన్న అతనిని పట్టుకొని నడిపిస్తూనెమ్మదిగా మంచం మీదికి చేర్చింది. యాంత్రికంగా అతని షూ, సాక్స్ విప్పేసింది. నెమ్మదిగా టై లూజ్ చేసి తీసేసింది. భోజనానికి పిలిచింది. అతనికి వినపడుతూనే ఉన్నాయి.

కాని మత్తులో ఉన్నట్లుగా నటిస్తున్నాడు. ఒక ప్రక్క ప్రియను చూస్తే జాలేస్తోంది. కాని ఆమెలో మార్పు తీసుకురావటానికే అతని ఈ ప్రయత్నం. అతను లేచేస్థితిలో లేడని గ్రహించి, స్వీటీ దగ్గరకెళ్ళి పోయింది. రాత్రంతా అక్కడే ఉంది.

శ్రీకాంత్ చాలా ప్రొద్దుపోయాక లేచాడు. బాత్రూం నుండి బయటకి వస్తోంటే ప్రియ కాఫీ కప్పుతో ఎదురైంది. 'ఇది కలా! నిజమా!' అని తనని తాను గిల్లి చూసుకున్నాడు...

"నిజమే!"

అప్పుడు ప్రియ కళ్ళలోకి చూశాడు. ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఏడిపించడం భావ్యంకాదని "స్వీటీకి ఎట్లా ఉంది?" పలకరించాడు.

"ఫరవాలేదు. ఇప్పుడే లేచింది."

"అయితే రాత్రంతా నీవు నిద్రపోలేదా?" ఏమీ తెలియనట్లు అడిగాడు.

ప్రియకు వెంటనే కళ్ళలో నీళ్ళు నిండాయి. మరు క్షణంలో అవి చెక్కిళ్ళ మీదుగా జల జలా రాలాయి.

"ఏడుస్తున్నావా ప్రియా?" అంటూ దగ్గరకు తీసుకొని కన్నీళ్ళు తుడుస్తోంటే, దుఃఖాన్ని ఆపుకోలేక భోరుమని ఏడ్చింది.

"నన్ను క్షమించండి..." ఆ తరువాత ఆమె ఏమంటుందో అతనికి వినిపించడం లేదు.

మనసంతా తేలిపోతున్నట్లుగా ఉంది.

"మనలో మనకి క్షమాపణ లేమిటి ప్రియా? నిన్ను నువ్వు తెలుసుకోడానికి కాస్త టైమ్ పట్టింది...అంతే! పద... స్వీటీ దగ్గరకు వెళ్దాం" అంటూ భార్యను హత్తుకొని, గట్టిగా ముద్దు పెట్టుకొని, అలాగే పాదవి పట్టుకొని నడిపిస్తున్నాడు.

భర్త కళ్ళలో కాంతిని చూసి మొదటిసారి తృప్తిగా ఫీలయ్యింది ప్రియ. ఆ క్షణంలో మదపుటేనుగును వశపరచుకున్నంత సంతోషంగా ఫీలయ్యాడు శ్రీకాంత్.


ఎస్. విజయ,
1 - 9 - 11 / 9బి/ 1, అజంపుర వీధి,
మెదక్ - 502 110.